# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 09.12.2024 | 24 క్యారెట్లు 79,215.00 | కిలో వెండి 96,445.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:47

www.vishalabharati.com




# నేడు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

- సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం.. లక్ష మంది మహిళలు హాజరు
- ఏడాది ముగింపు వేడుకలకు భారీ ఏర్పాట్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన తెలంగాణ తల్లి నూతన విగ్రహాన్ని నేడు సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో సచివాలయంలో ఏర్పాటైన అపురూపం నేడు ప్రజలకు దర్శనం ఇవ్వబోతుంది. అట్టహాసంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలతో పాటు, ప్రతిపక్ష పార్టీల నాయకులు సహా లక్ష మంది మహిళలకు ఆహ్వానం పంపారు. వారి సమక్షంలోనే విగ్రహావిష్కరణ జరగనుంది. ఈ నేపథ్యంలో విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రుల బృందం ఆదివారం నాడు పరిశీలించారు. ఈ సాయంత్రం సచివాలయంలో పర్యటిస్తూ.. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను ఆరా

..మిగతా 2 లో





నేటి నుంచి తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా..? అన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా జోరుగా సాగుతోంది. అయితే కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని,. అందుకే తాను మౌనంగా ఉంటున్నానని గత కొన్నాళ్లుగా పదే పదే చెప్తూ వస్తున్న కేసీఆర్.. రేవంత్ రెడ్డి సర్కారు ఏడాది పూర్తి చేసుకున్న తర్వాత నిర్వహిస్తున్న ఈ శీతాకాల సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా హాజరవుతారా లేదా అన్న చర్చ నడుస్తోంది. మరోవైపు.. సీఎం రేవంత్ రెడ్డి దొరికిన ప్రతి వేదిక నుంచి అసెంబ్లీకి రావాలంటూ కేసీఆర్‌ను ఆహ్వానిస్తూనే ఉన్నారు. సవాళ్ల మీద సవాళ్లు విసురుతూనే ఉన్నారు. అయితే.. ఈరోజు జరిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో.. కేసీఆర్ నేతలకు చేసిన దిశానిర్దేశంతో.. ఈసారి సమావేశాలకు కూడా కేసీఆర్ హాజరుకారని తెలుస్తోంది.

# కేసీఆర్‌రాక అనుమానమే..!

## నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- మరోసారి డుమ్మా కొట్టనున్న ప్రతిపక్ష నేత
- అన్నీ ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- స్పీకర్ ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం
- అధికారులకు స్పీకర్ కీలక సూచనలు
- సభ్యులు అడిగిన సమాచారం వెంటనే ఇవ్వాలని ఆదేశాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ అధికారులతో ఈరోజు శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, స్పీకర్ శాంతి కుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... రేపటి నుండి శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని, గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ

..మిగతా 2 లో



# ఎయిర్ షో సూపర్

- సాగర తీరంలో విమానాల కనువిందు
- ట్యాంక్ బండ్ పరిసరాల్లో సందడే సందడి
- భారీగా తరలివచ్చిన నగర జనం
- వీక్షించిన సీఎం రేవంత్, మంత్రులు
- అలరించిన సిప్లిగంజ్ మ్యూజిక్ కాన్సర్ట్
- స్టాళ్లను సందర్శించిన సినీ తారలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రజాపాలన విజయోత్సవాలు ట్యాంక్‌బండ్‌పై అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎయిర్ షో

..మిగతా 5 లో



# అవినీతిలో బీఆర్ఎస్ నెం.1

- పదేళ్లలో మీరు చేసిందేమిటి..?
- మాపై ఛార్జ్‌షీట్ వేస్తారా..?
- అసెంబ్లీకి రాకుంటే కేసీఆర్ చరిత్ర హీనుడిగా మిగులుతారు
- తెలంగాణ తల్ల విగ్రహావిష్కరణకు రాని వారంతా ద్రోహులే
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. పదేళ్లలో మీరు ఏం చేశారని.. మాపై ఛార్జ్‌షీట్ అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి చేయని పథకం లేదంటూ దుయ్యబట్టారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్ రాకుంటే చరిత్ర హీనునిగా

..మిగతా 2 లో

# వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ

- ధరణి స్థానంలో కొత్త యాప్ ఈ సమావేశాల్లోనే కొత్త ఆర్వోఆర్‌కు ఆమోదం
- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ఇది ఒక్కసారితో ముగిసే కార్యక్రమం కాదు
- రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నది పచ్చి అబద్ధం
- రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది
- ఓడినా బీఆర్ఎస్‌కు సిగ్గు రాలేదు
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

..మిగతా 2 లో



# మోహన్‌బాబు, మనోజ్ ఫైటింగ్..

- మంచు ఫ్యామిలీలో గొడవలు.. మనోజ్‌కు తీవ్ర గాయాలు
- నడవలేని స్థితిలో ఆసుపత్రికి.. మెడకు కట్టు, కాలికి గాయం
- అనుమానాస్పద దెబ్బలున్నాయన్న వైద్యులు
- పోలీసులకు సమాచారం అందజేత..

..మిగతా 2 లో



# రూ.300కే ఇంటర్నెట్, టీవీ

- ఇంటి నుంచే 150 రకాల సేవలు
- టీఫైబర్, మీ సేవ యాప్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

2 లో

# కాంగ్రెస్‌లో నాకు దోస్తులున్నరు

- నేను ఏ పార్టీలోనైనా రాణిస్తా
- బీజేపీ అధ్యక్ష పదవిపై సమాచారం లేదు
- వచ్చిన అవకాశాన్ని రేవంత్ పాడుచేసుకుంటున్నడు
- ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ పార్టీలో తనకు మంచి దోస్తులు ఉన్నారని.. ఏ పార్టీలోనైనా తాను రాణించగలనని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడారు. మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం

..మిగతా 2 లో

# రేవంత్‌ను వదిలేదే లేదు..



- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కడిగేస్తాం
- ఆరు గ్యారెంటీలపై నిలదీస్తాం
- రాష్ట్ర ప్రజల గొంతుకై పోరాడతాం
- మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రైతుల తరపున అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గురుకులాల్లో ఉన్న దుర్భర పరిస్థితులపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఓ రిపోర్ట్ ఇచ్చామన్నారు. రైతులపై దాడి చేస్తూ భూములు లాక్కుంటూ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

"మా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల హక్కుల ఉల్లంఘన జరుగుతుంది. అత్యంత మూర్ఖంగా, అనాలోచితంగా చరిత్ర గురించి తెలియకుండా ఏర్పాటు చేస్తున్న విగ్రహం గురించి పోట్లాడతాం. మోసాలు, అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టోపై నిలదీస్తాం. రాష్ట్ర ప్రజల గొంతుకై తెలంగాణ సమస్యలపై అసెంబ్లీలో పోరాడతాం.



# రైతులపై మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం

- పాదయాత్రను నిలిపివేసిన కర్షకులు
- పంజాబ్–హర్యానా సరిహద్దులో ఉద్రిక్తత

2 లో

# జన గణన చేస్తున్న బీజేపీకి, కుల గణన చేయడానికి ఇబ్బందేటి?

- రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్

బాల్కొండ, విశాల భారతి :జన గణన చేస్తున్న బీజేపీకి, కుల గణన చేయడానికి ఇబ్బంది ఎందుకు అని రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి అన్నారు.ఆదివారం నిజామాబాద్ జిల్లా అయిలాపూర్ గ్రామంలో పద్మశాలి ఐక్యత శంఖారావం కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ అనిల్ ఈరవత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీల జనాభా దాదాపు 54 శాతం ఉంటారు. కానీ వారికి రిజర్వేషన్లు మాత్రం కేవలం 27 శాతం మాత్రమే అని అన్నారు. కులగణన ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని రాహుల్ గాంధీ భావించి కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తే,బీజేపీ కుల గణనను ఎందుకు వ్యతిరేకిస్తోందో ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు


# కేసీఆర్‌రాక అనుమానమే..!

మొదటిపేజీ తరువాయి

సమావేశాల హుందాతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలన్నారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలన్నారు. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, గత సమావేశాలకు సంబంధించిన ప్రశ్నలకు పెండింగులో ఉన్న జవాబులను వెంటనే పంపించాలన్నారు. సభలో గౌరవ సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సభకు, గౌరవ సభ్యులకు అందించాలని, సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే పంపినట్లయితే వాటిని సభ్యులు చదువుకొని సభలో మాట్లాడడానికి, చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశాలు జరిగినన్ని రోజులు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలి. ప్రతి శాఖ తరుపున ఒక నోడల్ అధికారిని నియమించాలని, శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సభ లోపలితో పాటుగా, పరిసరాలలో కూడా శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే చర్చలు బాగా జరుగుతాయని, గౌరవ సభ్యులుసమయానికి సజావుగా శాసనసభకు చేరుకోవడానికి రహదారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం.. కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రేపటి నుండి జరిగే సమావేశాలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరుతున్నామని, జిల్లాల పర్యటనలో ప్రోటోకాల్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి, ఉల్లంఘన జరుగుతుందన్నారు. ప్రోటోకాల్ విషయంలో వివాదాలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, శాసనమండలి పరిసరాలలో చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖది అని ఆయన వ్యాఖ్యానించారు. పొరపాట్లు జరగకుండా , సభ సజావుగా జరిగే విధంగా సహకరించాలని, శాసన మండలి సమావేశాలు జరిగే సమయంలో అధికారులు తప్పక హాజరవ్వాలి. సమన్వయంతో రెండు సభలను సజావుగా నడిచేలా చూడాలన్నారు. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, ప్రోటోకాల్ ఉల్లంఘన సంఘటనలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# వీఆర్వో వ్యవస్థ పునరుద్ధరణ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను పున:ప్రారంభిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను పున:ప్రారంభిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "పదేళ్ల పాలనకు...ఏడాది ఇందిరమ్మ పాలనకు స్పష్టమైన తేడా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిని ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకున్నాం. మేం అధికారంలోకి వచ్చే నాటికి 2 లక్షల 40 వేల అప్లికేషన్లు పెండింగ్ లో ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వస్తున్నాం. డిసెంబర్ 1 నుంచి ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీకి అప్పగించాం. 2024 కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తయారు చేశాం. అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదిస్తాం. గతంలో ధరణి 33 మాడ్యుల్స్‌తో ఇబ్బందిగా ఉండేది. మాడ్యుల్స్‌ను తగ్గిస్తాం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారు. మళ్ళీ మేం ఈ వ్యవస్థలను తీసుకు వస్తాం. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పింక్ షర్ట్స్ వేసుకున్న వాళ్ళకే వచ్చాయి. మేము అత్యంత నిరుపేదలకు మాత్రమే ఇళ్లు ఇస్తాం. ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్లు. ఇందిరమ్మ ఇళ్లు ఒక్కసారి ఇచ్చి వదిలేసే కార్యక్రమం కాదు. కేంద్రం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు ఇవ్వకపోయినా మా ప్రభుత్వం ఇస్తుంది. ఆనాటి ప్రభుత్వం ఖజానాను కొల్లగొట్టక పోయి ఉంటే వడివడిగా హామీలు నెరవేర్చే వాళ్ళం. అయినా మేము ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తాం. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను పరిష్కారం చేసుకుందాం. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంత మంది మాజీ మంత్రులు అంటున్నారు. రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగిందని ప్రధాన ప్రతిపక్షం గ్రహించాలి. మేము 15 నుంచి 18 శాతం అనుకున్నాం కానీ.. ఆశించినంత పెరగలేదు. ప్రతిపక్ష పార్టీకి జ్ఞానోదయం కలగకపోవటం బాధాకరం. ప్రతిపక్ష పార్టీకి డిశ్చార్జ్ షీట్ ప్రజలు ఇచ్చారు. ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో నడుపుతున్నది తుగ్లక్ పాలనా? సెక్రటేరియట్‌లో నడుపుతున్నది తుగ్లక్ పాలనా? రేపటి కార్యక్రమానికి కేసీఆర్ వస్తారని ఆశిస్తున్నాం' అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

# నేడు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మొదటిపేజీ తరువాయి

తీశారు. అంతేగాక ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా చూడాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**భారీగా తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపు**

సచివాలయంలో సోమవారం సాయంత్రం తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ అనంతరం జరిగే సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహేశ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ నాయకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లతో ఈ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాదిలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని, మెజారిటీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఏడాది పాలనపై ప్రభుత్వం చేసిన సభలకు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారని ఆయన పేర్కొన్నారు. నేడు జరిగే ముగింపు ఉత్సవాలలో భాగంగా సచివాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని, ఆ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

# అవినీతిలో బీఆర్ఎస్ నెం.1

మొదటిపేజీ తరువాయి



మిగిలిపోతారంటూ వ్యాఖ్యానించారు. హరీష్, కేటీఆర్ గురించి మాట్లాడడం అనవసమని సీఎం రేవంత్ రెడ్డికి సూచించా.. ఇక నేను కూడా మాట్లాడను. తెలంగాణ విగ్రహావిష్కరణ కు రానివారంతా తెలంగాణ ద్రోహులే.. త్వరలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశాం" అని కోమటిరెడ్డి చెప్పారు.



# రైతులపై మళ్లీ టియర్ గ్యాస్ ప్రయోగం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పంటలకు కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన చలో దిల్లీ పాదయాత్రను రైతు సంఘాల నేతలు తాత్కాలికంగా నిలిపివేశారు. శంభు సరిహద్దు వద్ద ఆదివారం మరోసారి పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించడం వల్ల కొందరు కర్షకులు గాయపడడమే ఇందుకు కారణం. పంజాబ్‌హరియాణా సరిహద్దు శంభు మరోసారి ఉద్రిక్తంగా మారింది. చలో దిల్లీ పిలుపులో భాగంగా రైతులు తిరిగి ప్రారంభించిన పాదయాత్రను అడ్డుకునేందుకు పోలీసులు బహుళ అంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. రైతులు వాటిని దాటుకొని వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ ఘటనలో కొందరు కర్షకులు గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈరోజుకు చలో దిల్లీ పాదయాత్రను నిలిపివేస్తున్నట్లు రైతు సంఘాల నేతలు ప్రకటించారు.

# రూ.300కే ఇంటర్నెట్, టీవీ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ అందించేందుకు ఉద్దేశించిన 'టీ ఫైబర్' ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ సేవలను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. టీ ఫైబర్ ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా శ్రీరాంపూర్ వాసులతో మంత్రి మాట్లాడారు. ఈ సేవలను పరిశీలించి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. దీంతో పాటు 'మీ సేవ' మొబైల్ యాప్ సేవలను సైతం ప్రారంభించారు. రైతులకు రుణమాఫీ, బోనస్ కోసం మొబైల్ యాప్ ప్రారంభించామని చెప్పారు.

**అసలేంటీ టీ ఫైబర్..?**

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విప్లవానికి నాంది పలికే దిశగా రాష్ట్రంలోని లక్షల ఇళ్లకు దశల వారీగా రూ.300కే ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చేలా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇది వైఫై కనెక్షన్ వంటిది. ఈ కనెక్షన్ తీసుకుంటే వర్చువల్ నెట్‌వర్క్‌తో పాటు టెలిఫోన్, పలు తెలుగు ఓటీటీలను గ్రామస్థులు చూడడానికి వీలు పడుతుంది. టీ ఫైబర్ పైలెట్ ప్రాజెక్టు కింద 3 జిల్లాల్లో ఒక్కో గ్రామంలో 4 వేల కుటుంబాలకు కేబుల్ టీవీ సేవలతో కూడిన బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభమవుతాయి. తొలి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లోని 2,096 పంచాయతీల్లో అమలు చేయనున్నారు. ఆదివారం పెద్దపల్లిలోని అడవి శ్రీరాంపూర్, సంగారెడ్డి సంగుపేట, నారాయణపేటలోని మద్దూర్‌లో తొలుత ఈ సేవలు ప్రారంభమయ్యాయి.ఈ కనెక్షన్ తీసుకుంటే ప్రతీ ఇంట్లో ఉన్న టీవీనే కంప్యూటర్‌గా మారుతుంది. ప్రతీ ఇంటికి రూ.300కే.. 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో కనెక్షన్ ఇస్తారు. దీంతో చెల్లింపులు కూడా చెయ్యొచ్చు. గ్రామంలోని అన్ని కార్యాలయాలు, స్కూళ్లకు కూడా కనెక్షన్ ఇవ్వనున్నారు. టీవీనే కంప్యూటర్‌గా మారుతుండడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ జంక్షన్లు, ఇతర చోట్ల కూడా అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫైబర్ నెట్‌తో అనుసంధానం చేయబోతున్నారు. ఇవి ప్రతి పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమవుతాయి.

**ఇంటి నుంచే 150 రకాల సేవలు**

అలాగే, ప్రజలు ఇంటి నుంచే పౌర సేవలు పొందేలా మీసేవ మొబైల్ యాప్‌ను సైతం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. దీని ద్వారా 150 రకాల పౌర సేవలు అందనున్నాయి. షాపింగ్ మాల్స్, మెట్రో స్టేషన్లు, సమీకృత కలెక్టరేట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఇంటరాక్టివ్ కియోస్క్ ద్వారా ప్రజలు ఈ సేవలు పొందొచ్చు. దరఖాస్తు నింపడం, చెల్లింపులు చేయడం, సర్టిఫికెట్ ప్రింట్ తీసుకునే సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది.

# మోహన్‌బాబు, మనోజ్ ఫైటింగ్..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

మంచు మోహన్ బాబు ఫ్యామిలీలో తరుచూ గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం మరోసారి వీరి కుటుంబ కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈరోజు ఉదయం మోహన్ బాబు స్కూల్ కు చెందిన కొంతమంది గుండాలతో.. తనపై, తన భార్యపై దాడి చేయించాడని మంచు మనోజ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం సంచలనం రేపింది. తర్వాత మనోజే తనపై దాడికి పాల్పడ్డాడు అంటూ మోహన్ బాబు స్టేషన్ మెట్లు ఎక్కడం గమనార్హం. ఇదిలా ఉంటే ఆదివారం సాయంత్రం.. భార్యతో కలసి నడవలేని స్థితిలో మంచు మనోజ్ బంజారాహిల్స్ లోని టీఎక్స్ ఆసుపత్రిలో చేరగా.. ఆయనకు ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందించింది వైద్యబృందం. నిన్న సాయంత్రం మనోజ్ ఆరోగ్యంపై వివరాలు వెల్లడిస్తూ.. ఆయనకు సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ ఎక్స్‌రే పరీక్షలు చేయగా.. ఇంటర్నల్‌గా కాలు, మెడ భాగంలో అనుమానాస్పద దెబ్బలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు కూడా తాము సమాచారం అందించామని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్ళినట్లు తెలియజేశారు. కాగా ఈ ఘటనపై పోలీసులు మనోజ్ ఇంటికి వెళ్ళి స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నారని సమాచారం. హాస్పిటల్ నుంచి ఇంటికి వెళుతున్న మంచు మనోజ్ మెడకు పట్టీ పెట్టుకుని కనిపించారు. అయితే ఈ వ్యవహారం గురించి మీడియాతో మాట్లాడేందుకు మంచు మనోజ్ గానీ, అతని భార్య భూమా మౌనిక గానీ ఏమాత్రం సుముఖత చూపకపోవడం గమనార్హం.

# కాంగ్రెస్‌లో నాకు దోస్తులున్నరు

మొదటిపేజీ తరువాయి

చేశారు. మూసీలో విషపునీరు కలవకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. మూసీ పేరిట పేదలను రోడ్డునపడేయటం కరెక్టు కాదని అన్నారు. కూల్చివేతల సమయంలో ఇళ్లకు రెడ్ మార్కింగ్ చేసి వెళ్లిపోతే ఆ ప్రజలు అల్లాడిపోయారని గుర్తు చేశారు. పేదల స్థలాలు కూల్చివేసి మేడలు, మల్టీప్లెక్సులు కట్టడం ఎందుకని ప్రశ్నించారు. మూసీ పరిధిలో ఉండాలని సీఎం రేవంత్ నన్ను అడగటం ఏంటని అన్నారు. 10 గంటల పాటు మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోనూ తనకు మంచి దోస్తులు ఉన్నారని ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో ఏం జరుగుతుందో తెలియక కాంగ్రెస్ నేతలే తలలు పట్టుకుంటున్నారని అన్నారు. సీఎంగా పనిచేసే అవకాశాన్ని రేవంత్ రెడ్డి పాడు చేసుకుంటున్నాడని అన్నారు. తనకు రాజకీయాలు చేయడం చేతకాదని.. ప్రజలకు ఏం చేస్తే మేలు జరుగుతుందో అదే చేస్తానని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై తనకు సమాచారం లేదని తెలిపారు. రాజకీయ నేతగా నేను ఏ పార్టీలో అయినా రాణించగలను అని అన్నారు. లెఫ్ట్ బ్యాక్‌గ్రౌండ్ కాబట్టే పదవి దక్కట్లేదని అనుకోవట్లేదని చెప్పారు. అసలు లెఫ్ట్ లేదు.. రైట్ లేదు.. దేశ ప్రజల ప్రజల ప్రయోజనాలే బీజేపీకి ముఖ్యమని అన్నారు. మల్కాజిగిరి ప్రజలను ఎన్నటికీ మర్చిపోను అని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి కొద్దిలో అధికారం మిస్సయ్యిందని అన్నారు. ఫలితాల తర్వాత తాము మదనపడ్డామని చెప్పారు.




# గిరిజన జన సమితి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా కేతావత్ ధర్మ నాయక్
- జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా శంకర్ చౌహాన్,నియామకం

విశాల భారతి,జహీరాబాద్ :

గిరిజన జన సమితి సంఘం వ్యవస్థాపకులు వినోద్ నాయక్, ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. గిరిజన జన సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కేతావత్ ధర్మ నాయక్,ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్బంగా ధర్మ నాయక్, మాట్లాడుతూ.. మన జాతి కోసం కష్టపడి పనిచేసే ఉన్నత స్థాయికి ఉన్నత శిఖరాలకు చేరాలని వారు యువతను కోరడం జరిగింది.మన జాతి కోసం సేవాలాల్ మహారాజ్ అడుగు జాడల్లో నడుచుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గిరిజన జన సమితి రాష్ట్ర అధ్యక్షులు వినోద్ నాయక్ పాల్గొనడం జరిగింది.అదే విధంగా జహీరాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ అధ్యక్షుడిగా చావాన్ శంకర్,అసెంబ్లీ వైస్ ప్రసిడెంట్ గా పవర్ పుల్సింగ్,జహీరాబాద్ టౌన్ ప్రసిడెంట్ గా కిషన్ చౌహాన్,టౌన్ జనరల్ సెక్రెటరీగా రాథోడ్ అరుణ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ గా శ్రీనివాస్ రాథోడ్,లను ఎన్నుకొనడం జరిగింది అని వ్యవస్థపలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



vishalabharathi Telugu Daily

విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సోమవారం, 09.12.2024

హైదరాబాద్

epaper:vishalabharati.com

www.vishalabharati.com




## ఉపాధ్యక్ష పదవికి రాజబాబు నామినేషన్

సైదాపూర్, విశాల భారతి

ఐజేయు అనుబంధ టి యు డబ్ల్యూ జే కరీంనగర్ జిల్లా శాఖ ఉపాధ్యక్ష పదవికి సైదాపూర్ మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెరుమాండ్ల రాజబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన టియూడబ్ల్యూజే కరీంనగర్ జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. ఉపాధ్యక్ష పదవికి పెరుమాండ్ల రాజబాబు, సారబుడ్ల రాజిరెడ్డి ఈసీ మెంబర్ గా ఆదివారం కరీంనగర్ ప్రెస్ భవన్ లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండారి గట్టయ్య, పాత్రికేయులు మోలుగురు తిరుపతి,దొనికెన వేణుగోపాల్,బొడ్డుల తిరుపతి పాల్గొన్నారు.





## భారతీయ వారసత్వ వస్త్రాల పునరుద్ధరణలో ముందుఅడుగు

- విభాగం విద్యార్థుల స్ఫూర్తికి నిదర్శనం.
- డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో స్నాతక్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, విశాలభారతి:

యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, ఓయూ టెక్స్టైల్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో "స్నాతక్"అనే వినూత్న ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఉపయోగించే సాంప్రదాయ వస్త్రాల స్థానంలో భారతీయ వారసత్వాన్ని ప్రతిబింబించే విశిష్టమైన వస్త్రాలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుందని విభాగం ఆచార్యులు వాపోయారు. టెక్స్టైల్ టెక్నాలజీ విద్యార్థులు చేపట్టిన ఈ విశేషమైన ప్రారంభం, సాంస్కృతిక మరియు స్థిరమైన ఆవిష్కరణలకు వారి సృజనాత్మకత మరియు నిబద్ధతను సూచిస్తుందన్నారు. చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు "స్నాతక్" కాన్సెప్ట్ ప్రదర్శించారు. వారి ఫీడ్‌బ్యాక్ మరియు సూచనల ఆధారంగా, ఉత్పత్తి త్వరలో ఖరారు చేయబడుతుంది, తద్వారా ఇది త్వరలో అధికారికంగా ప్రారంభించబడుతుంది.ఈ వినూత్న కార్యక్రమం ఓయూ విద్యార్థుల వినూత్న స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, మరియు విద్యా సంప్రదాయాలలో భారతీయ వారసత్వ వస్త్రాలను పునరుద్ధరించడంలో ఒక ముఖ్యమైన అడుగని ఆచార్యులు ధీమా వ్యక్తం చేశారు.టెక్స్టైల్ టెక్నాలజీ విభాగం అధిపతి సీనియర్ ప్రొఫెసర్ జె.హయవదన, డీన్, ఫాకల్టీ ఆఫ్ ఫార్మసీ, ప్రొ.చింత సాయిలు,డా.ఆర్.రేణు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- రెండో రోజు నిరసన దీక్ష
- దీక్షకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

మునుగోడు,విశాలభారతి:

మండలంలోని శనివారం స్థానిక మండల వనరుల కేంద్రం ముందు విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు రెండవ రోజు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి చందపాక నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగుల కు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో 10వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలియజేశారు.సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణ చేసి మాకు న్యాయం చేయాలని, జిల్లా మహిళా అధ్యక్షురాలు మేడి సావిత్రి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 10 లక్షలు,ఆరోగ్య భీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలని, పదవి విరమణ చేస్తున్న వారికి చేసిన బెనిఫిట్స్ ఇవ్వాలని,ప్రభుత్వ మరియు విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, పీటీఐ లకు 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు. పీఆర్టియు, టీపియుఎస్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కళావతి , వెంకటేశ్వర్లు, చంద్రం, జిల్లా బాధ్యులు వలి పాషా ,సత్తిరెడ్డి, కార్యదర్శి జి నరసింహా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు గండమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఐఎస్ దివ్య, ఐఈఆర్పి ఇందిర, కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయులు సీఆర్టి భారతి ప్రసన్న రాణి,నాగమణి, సభిత , పీజీ సీఆర్టీ కవిత, ఏఎన్ఎం శైలజ,డే వాచ్ ఉమెన్ ఇందిరమ్మ, పిటిఐ లు అంజయ్య , శైలజ, సీఆర్పీ సైదులు, సతీష్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.





## కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షునిగా అమరేందర్

- అభినందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో ఆదివారం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షునిగా ఎస్.అమరేందర్, జనరల్ సెక్రటరీగా కె.ఎన్ జనార్ధన్, ట్రెజరర్ గా పి.జోషి కుమార్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన పాలకవర్గాన్ని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎండీఆర్ ఫౌండేషన్ పృథ్వి, ప్యాక్స్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి, కాలనీ మాజీ ప్రెసిడెంట్ మాణిక్య రెడ్డి, పాత పాలకవర్గం సభ్యులు శ్రీరాములు, బల్వంత, నారాయణ, అమరేందర్ రెడ్డి, కాలనీ పెద్దలు, కాలనీ వాసులు పాల్గొన్నారు. కాలనీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన అమరేందర్ మాట్లాడుతూ కాలనీలోని అన్ని సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. కాలనీని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన పేర్కొన్నారు.



## దివ్యాంగుల అభివృద్ధికి పాటు పడాలి

- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు
- తులేకలాన్ లో వికలాంగులకు ఉచిత బస్ పాస్ లు అందజేత

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

దివ్యాంగులకు అండగా నిలబడి, వారి అభివృద్ధికి కృషి చేయాలని ఇబ్రహీంపట్నం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి సహకారంతో ఆర్టీసీ 2 డిపో అధికారులు తులేకలాన్ గ్రామానికి చెందిన 60 మంది దివ్యాంగులకు జారీ చేసిన ఉచిత బస్ పాస్ లను గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కొద్దిపాటి సహకారాన్ని అందిస్తే దివ్యాంగులు స్వతంత్రంగా ఎదుగుతారని , తమ కాళ్లపై తాము నిలబడుతారని అన్నారు. గ్రామానికొకరు చొప్పున దాతలు ముందుకొచ్చి దివ్యాంగుల ఉచిత బస్ పాస్ లకు ఆర్థికంగా సహాయపడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొంగర బీరప్ప , ఆర్టీసీ అధికారులు శివరాజ్ గౌడ్ , నాయిని అంజయ్య , గ్రామ శాఖ అధ్యక్షుడు గుజ్జ యాదగిరి , నాయకులు సామ జంగారెడ్డి , ఆంజనేయులు , జక్కుల వెంకటేష్ , చేగూరి ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలోకి బలదేవ్ రెడ్డి

తుర్కయంజాల్, విశాలభారతి:

తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇబ్రహీంపట్నం ప్రాంత సీనియర్ నాయకులు కందాల బలదేవ రెడ్డి బీజేపీలో చేరారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి సమక్షంలో కమలం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని, ఆయన మార్గదర్శకంలోనే నడవాలన్న కాంక్షతో బీజేపీలో చేరినట్లు తెలిపారు.



## పార్టీలకు అతీతంగా నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు

- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక
- అధికారులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

పార్టీలకు అతీతంగా నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు పారదర్శకంగా ఎంపిక జరుగుతుందనీ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్, యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్కు నరసింహ అన్నారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు కార్యకర్తలతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో గ్రామాల్లో అధికారులకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు , కార్యకర్తలు సహకరించాలని అన్నారు. నేటి నుంచి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కోసం పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించనున్నారని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు స్వయంగా వారి వెంటనుండి తోడ్పాటును అందించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, గడ్డ మళ్ళాయ గూడ మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్ రెడ్డి , ఎస్సి సేల్ మండల అధ్యక్షుడు చిన్నోళ్ళ మల్లేష్, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి నీలం వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## మహా పడిపూజలతో మార్మోగుతున్న పల్లెలు

- అయ్యప్ప పూజలతో ఆధ్యాత్మిక సౌరభం
- తులేకలాన్ గ్రామంలో పడిపూజలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

కార్తీకమాసం ప్రారంభం నుండి మొదలైన అయ్యప్ప స్వామి మహాపడి పూజలు గ్రామాలు , పట్టణాలలో కన్నుల పండుగలా కొనసాగుతున్నాయి. అయ్యప్ప నామస్మరణతో , ఉర్రూతలూగించే భజన గీతాలతో ఆధ్యాత్మిక సౌరభం విరాజిల్లుతున్నది. గ్రామాలలో , పట్టణ బస్తీలలో వందలాది మంది అయ్యప్ప మాలధారులు ఒక్కచోట చేరి మహా పడిపూజలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో, కఠిన నియమాలతో మాలధరించే స్వాములు , వారి కుటుంబసభ్యులు శ్రద్ధగా పూజల్లో పాల్గొంటున్నారు. అలంకార ప్రియుడైన అయ్యప్పస్వామి ని రకరకాల పూలతో అలంకరించి స్వాములు నిష్ఠగా పూజలు నిర్వహిస్తున్నారు. పంచామృతాలతో స్వామివారి విగ్రహాలకు అభిషేకం చేసి తరిస్తున్నారు. అన్నదాన ప్రభువులుగా స్వాములతోపాటు , భక్తజనులకు కడుపునిండా భోజనం పెట్టి దేవదేవుడి అనుగ్రహం పొందుతున్నారు. స్వామియే శరణమయ్యప్పా అంటూ స్వాముల శరణఘోషలతో భక్తజనం పులకరించిపోతున్నారు. ఆదివారం తులేకలాన్ గ్రామంలో ధనుంజయ గురుస్వామి , జనార్దన్ గౌడ్ గురుస్వాముల ఆధ్వర్యంలో శామల రవిస్వామి , శరణ్ స్వామి నిర్వహించిన మహా పడిపూజలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది స్వాములు పూజలో పాల్గొన్నారు.




## దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేసిన యువకుడు

పటాన్ చెరు,విశాలభారతి:

దివ్యాంగులకు ఓ యువకుడు పండు పంపిణీ చేసి మంచి మనసును చాటుకున్నాడు. పటాన్‌చెరు మండలం ముత్తంగీ గ్రామానికి చెందిన సాయిరాం అనే యువకుడు 20 మంది దివ్యాంగులకు ఆదివారం ఉచితంగా పండ్లు అందజేశారు. ఇస్నాపూర్ పరిధిలోని రామాలయం ఆవరణలో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం దివ్యాంగులకు పండ్లను పంపిణీ చేయడం జరిగింది. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని సాయిరాం 20 మంది దివ్యాంగులకు వివిధ రకాల పండ్లు అందించినట్టు తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టిఎండిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సాయిరాం రవికుమార్ ను శాలువాను కప్పి, పూల మొక్కను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు బాపు వెంకన్న, యువ చైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు కంచిగారి మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కంజర్ల జ్యోతి, సభ్యులు సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మణిరత్నం, బుజ్జి, మహేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న జాతర

ధర్పల్లి, విశాల భారతి:

ధర్పల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో మల్లన్న జాతర యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం వారు ప్రతి ఒక్క ఇంటి నుండి బోనం ఎత్తుకొని మల్లన్న గుడి వద్దకు డప్పు వాయిద్యాలతో వెళ్లి మల్లన్నకు పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు, అన్నప్రసాదాలు సమర్పించారు. అనంతరం భక్తులు అన్నదాన సత్రంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దమన్నపేట్ యాదవ సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని యాదవ సంఘం సభ్యులు అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
09.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ప్రజల్లోకి ప్రభుత్వ అభివృద్ధిని తీసుకెళ్లాలి

బాల్కొండ,విశాలభారతి

భీమ్‌గల్ మండలం కాంగ్రెస్ యువజన అధ్యక్షుడుగా ముచ్కుర్ గ్రామానికి చెందిన బద్ది అవినాష్ ఇటీవలే జరిగిన రాష్ట్ర యువజన ఎన్నికల్లో మెజారిటీతో గెలుపొందారు.ఈ విజయం ఆయనకు వరుసగా రెండోది.ఈ సందర్భంగా జిల్లా యువజన నాయకుడు అరేపల్లి నాగేంద్ర బాబు అధ్వర్యంలో అవినాష్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,రాష్ట్ర ఖనిజా అభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్ ని మర్యాద పూర్వకంగా కలిసి వారిని సన్మానించారు.ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపి,పార్టీని బలోపేతం చేస్తూ,ప్రజల్లోకి ప్రభుత్వ అభివృద్ధిని తీసుకెళ్లుతు ముందుకెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీరాం రవి,యువ నాయకులు సుంకరి సురేష్,యువకులు పాల్గొన్నారు.



## అంగన్వాడి మోడల్ కేంద్రం ప్రారంభం

- ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం మన ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి

డోర్నకల్, విశాలభారతి:

నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్ ,ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్ ,పాల్గొని శంకు స్థాపన చేశారు.మరిపెడ పట్టణ కేంద్రంలో అమృత్ మంచినీటి సరఫరా, మరిపెడ పట్టణ కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ గృహ నిర్మాణము, అబ్బాయిపాలెం గ్రామంలో అంగన్వాడి మోడల్ కేంద్రం సెంటర్ ను ప్రారంభించారు. పిల్లలకు యూనిఫాం పంపిణీ అనంతరం రాష్ట్రమంత్రి పొంగలిటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీల బలపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గోవింద్ రామ్నాథ్ కేకన్, డి పి ఆర్ ఓ రాజేంద్రప్రసాద్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు యుగేందర్ రెడ్డి, యువజన నాయకులు అభినవ్ రెడ్డి, డి డబ్ల్యూ ఓ ధనమ్మ, సిడిపిఓ ఎల్లమ్మ, సూపర్వైజర్ పద్మ, ఉషారాణి, అంగన్వాడి సెంటర్ టీచర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# సరూర్నగర్ లో నడ్డా సభ అట్టర్ ప్లాప్

- బిజెపి జూమ్లు పార్టీ.
- 2వేల మంది జనం కూడా లేక వెలవెల పోయింది
- కేంద్రం నుంచి తెలంగాణకు తెచ్చిందేమిటో కేంద్రమంత్రి, బిజెపి ఎంపీలు చెప్పాలి
- అక్కసు తోనే విమర్శలు
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఫైర్..



ఎల్బీనగర్ విశాల భారతి :

బిజెపి పార్టీకి రాష్ట్రంలో ఆదరణలేదని, నడ్డా సభకు 2వేల మంది జనం కూడా లేక వెలవెల పోయిందని.. వారి సభ అట్టర్ ప్లాప్ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఎద్దేవా చేశారు. మొన్న జరిగిన బిజెపి సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలు చేసిన విమర్శలపై మధుయాష్కి గౌడ్ ఆదివారం ఎల్బీనగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి రామ్ రెడ్డి , జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి , పార్టీ నేతలు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, ఎస్వీ కృష్ణ ప్రసాద్, కార్పొరేటర్ సుజాత నాయక్ తదితరులతో కలిసి మాట్లాడుతూ... 11 ఏళ్ల బిజెపి పాలనలో కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇచ్చింది ఏమిటో చెప్పలేని దుస్థితిలో బిజెపి నాయకులు ఉన్నారని పేర్కొన్నారు.తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను ప్రజలు గెలిపిస్తే తెలంగాణకు తెచ్చింది ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రూపాయ నిధులు తీసుకురాలేని చేతకాని దద్దమ్మలు మీరు కాదా? అని పేర్కొన్నారు. పర్యాటక మంత్రిగా బొగ్గు గనుల శాఖ మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి తెచ్చిన నిధులు ఎన్ని? చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు.బిజెపి పాలిత రాష్ట్రాలలో ఏనాడైనా రైతులను మాఫీ చేశారా,? ఒక్క ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఎప్పుడైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. అధికారంలో రాకముందుకు ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు. అని చెప్పిన మోడీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాడు? ప్రశ్నించారు. బిజెపి అంటేనే భారతీయ జూమ్లా పార్టీ అని విమర్శించారు. మద్దతు ధర కల్పించాలని రైతులు ఆందోళన చేస్తుంటే అణిచివేతే తప్ప ఏనాడైనా మోదీ వారి వద్దకు వెళ్లి సమస్య విన్నాడా? 3000 చదరపు కిలోమీటర్ల చదరపు విస్తీర్ణంలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించారంటే మోడీ ప్రభుత్వం వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. మూసి పునరుద్జీవంతో కాలుష్య రహితం నగరంగా హైదరాబాదును అభివృద్ధి చేస్తామంటే బిజెపి, బీఆర్ఎస్ నేతలకు కడుపు మంటతో అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఫ్యూచర్ సిటీతో ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతుంటే.. ప్రతిపక్ష పార్టీ నాయకులకు కళ్ళ మంటగా ఉందని విమర్శించారు. తమ రేవంత్ రెడ్డి ప్రభుత్వ కృషితో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు హైదరాబాదుకు వస్తున్నాయని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయంలో 7 లక్షల కోట్లతో అప్పుల కుప్పగా తెలంగాణను మార్చినప్పటికీ.. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. రైతులకు రుణమాఫీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే సబ్సిడీ సిలిండర్ల అందజేత, ఉచిత కరెంట్ అందిస్తున్నది బిజెపి బీఆర్ఎస్ నేతలకు కల్పిస్తలేదా ? అని ప్రశ్నించారు.మల్లెడ్డి రామ్ రెడ్డి , ముద్దగొని రామ్మోహన్ గౌడ్ , దరిపల్లి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నెలపాటి రామారావు, బుద్దా సత్యనారాయణ, పన్నాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయక్, గౌని నరసింహ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, కోటగిరి శ్రీనివాస్, బద్రినాథ్, సంరెడ్డి భుజంగారెడ్డి, భీమిలి రామకృష్ణారెడ్డి , గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## రైతులపై బీజేపీ ప్రభుత్వ దమనకాండను ఆపుచేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్య

మహబూబాబాద్, విశాలభారతి:

కంపెనీల కోసం తమభూములు గుంజుకోవటాన్ని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కనీస మద్దతు ధర చట్టం చేయాలని పోరాడుతున్న రైతులపై బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్భంధాన్ని ప్రయోగిస్తున్నాయని,అక్రమ కేసులు బనాయించి వందలాది మంది రైతులను జైళ్లలో నిర్భంధిస్తున్నారని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య ఆరోపించారు.ఈరోజు మహబూబాబాద్ లో జరిగిన అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ... వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర చట్టం కోసం 2020 నవంబర్ నుండి 13 నెలలపాటు ఢిల్లీ కేంద్రంగా లక్షలాది మంది రైతుల భాగస్వామ్యంతో జరిగిన రైతాంగ వుద్యమానికి దిగివచ్చిన మోడీ ప్రభుత్వం మద్దతు ధర చట్టం చేస్తామని రాత పూర్వక హామీ ఇచ్చి 3సంవత్సరాలైనా పట్టించుకోవటంలేదని వారు విమర్శించారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జడ సత్యనారాయణ (ఉపాధ్యక్షులు), మోకాళ్ళ మురళీకృష్ణ, గుజ్జు దేవేందర్, గట్టి క్రిష్ణ, భూక్యా నర్సింగ్, బొమ్మెడ సాంబయ్య, కలకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి వెంటనే పట్టాలు సరఫరా చేయాలి

- ఏఐకేఎంఎస్ డిమాండ్



బయ్యారం, విశాలభారతి:

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల పోసిన ధాన్యానికి వెంటనే పట్టాలు సరఫరా చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయ్యారం మండలంలో వెంకట్రాంపురం బాలాజీ పేట గొల్లగూడెం గౌరారం వినోబా నగర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ..గత వారం రోజుల నుండి తుఫాన్ చిరుజల్లులతో రైతులను అతలాకుతలం చేస్తుంది తయారైన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసి రైతులు అనేక అవస్థలు పడుతున్నారు తుఫాన్ ప్రభావం కూడా పెరిగే సూచనలు కనబడుతున్నందున కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యానికి పాల్తిన్ పట్టాలు వెంటనే సరఫరా చేసి ధాన్యాన్ని తడిసిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని వారు అన్నారు. ప్రస్తుతంఏ కొనుగోలు కేంద్రాల్లో కూడా పాలిథిన్ పట్టాలు సరఫరా జరగలేదు మబ్బులు. చిరుజల్లుల వలన కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం వారాల తరబడి ఉన్న ప్రభుత్వం విధించిన తేమశాతం రావడంలేదని వారన్నారు.తాలు మట్టి. తేమ తరుగు పేర్లతో వారాల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచుతున్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకొని తేమశాతాన్ని తగ్గించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంట పెట్టి. ట్రాన్స్ పోర్ట్ చేయాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు.

## మృతి చెందిన స్నేహితుడు కుటుంబానికి సాయం

ఆమనగల్లు, విశాలభారతి :



తమతో చదువుకుని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు కుటుంబానికి తోటి స్నేహితులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. 200809లో అమనగల్లు పట్టణంలోని వివేక విద్యా భారతి పాఠశాలలో అమనగల్లు మున్సిపాలిటీలోని పుల్గోనిపల్లి తాండ పదవ తరగతి చదువుకున్న స్నేహితులలో ఒకరైన బి.మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు.ఆ కుటుంబాన్ని అతనితో చదువుకున్న స్నేహితులు పరామర్శించి రూ. 70 వేలు నగదు, అందజేశారు.



## భారీ బహిరంగ సభకు తరలి రండి

- ఎస్సీ ఎస్టీ మైనార్టీ బలహీన వర్గాలు భారీగా తరలిరండి
- బ్లూ ఇండియా పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జి వెంకన్న నాయక్

డోర్నకల్, విశాలభారతి:

డోర్నకల్ నియోజకవర్గ మరిపెడ మండల కేంద్రం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు బ్లూ ఇండియా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ వెంకన్న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. డిసెంబర్ 15 తారీఖున మరిపెడ మండలం కేంద్రం భార్గవ ఫంక్షన్ హాల్ లో భారీ బహిరంగ సభకు అందరూ తరలి రావాలని. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమం కోరుకునే పార్టీ బ్లూ ఇండియా పార్టీ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ నునవత్ బాలు నాయక్, భూక్యా బిచ్చ నాయక్ ,మోహన్,కుమార్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయి

తొర్రూర్,విశాలభారతి:

మండలంలోని అరిపిరాల గ్రామంలోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను తొర్రూర్ స్థానిక ఎస్సై ఉపేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎస్సై ఉపేందర్ మాట్లాడుతూ. యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలి అని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు ఉండాలి అని, భవిష్యత్తులో ఇలా క్రీడా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి మీ మండలానికి మీ గ్రామానికి మీ ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే,ఓడిపోయినా నిరుత్సాహపడకూడదు అలాగే గెలిచాము అని గర్వపడవద్దు అంటూ స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలి. ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్, రావుల కిషన్ రెడ్డి, గద్దల పరుశురాం, వెంకటేష్,అరుణ్,శ్రావణ్,మహేష్, ప్రశాంత్, మధు, శివ క్రీడాకారులు,యువత తదితరులు పాల్గొన్నారు.

## యువత పార్టీలోకి వచ్చేలా ప్రోత్సహించండి

- టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



ఆమనగల్లు, విశాలభారతి :

యువతను కాంగ్రెస్ పార్టీలో చేర్పించడానికి తగిన కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన వస్పుల శ్రీకాంత్ యువజన కాంగ్రెస్ ఆమనగల్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో నాయకులతో పాటు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ని మహేష్ కుమార్ గౌడ్ అభినందించి జిల్లాలో మండల, పట్టణ కేంద్రాల్లో యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై ప్రతి పక్షాల దుష్ప్రచారంపై దృష్టిసారించాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శ్రీకాంత్ కి సూచించారు.




## నెరవేరిన ధర్పల్లి మండల ప్రజల కళ

- మండల కేంద్రానికి నూతనంగా 108 అంబులెన్సు సర్వీసు


ధర్పల్లి, విశాల భారతి:

ధర్పల్లి మండల కేంద్రానికి శనివారం నూతనంగా 108 ఆంబులెన్స్ మంజూరు అయ్యిందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్.సుశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సర్వీసు కావాలంటే సిరికొండ, ఇందల్వాయి లేదా డిచ్ పల్లి నుండి అంబులెన్స్ మనకు అందుబాటులో ఉండేది కానీ ఇప్పటి నుండి ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా 108 అంబులెన్స్ అందుబాటులో వచ్చిందని తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అంబులెన్స్ అందుబాటులో ఉంటే ప్రజల ప్రాణాలు త్వరగా కాపాడుకోగలుగుతామని, ప్రజలకు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఎట్టకేలకు అంబులెన్స్ వచ్చిన సందర్భంగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
09.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com







# ఎయిర్ షో సూపర్

మొదటిపేజీ తరువాయి


ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅథిగా హాజరై ఎయిర్ షోను ప్రారంభించారు. 15 సూర్య కిరణ్ విమానాలతో చేసిన విన్యాసాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన సూర్యకిరణ్ ఎరోబాటిక్ టీమ్ అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించింది. ఎయిర్ షోను తిలకించేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎంతో పాటు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మహమ్మద్ అలీ షబ్బీర్, వేం నరేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర అధికారులు ఎయిర్ షోను వీక్షించారు.

**అలరించిన మ్యూజికల్ నైట్**

ఐమాక్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసినటువంటి సంగీత కార్యక్రమం సంగీత అభిమానుల కేరింతల మధ్య జరిగింది. ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పాడిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. విజయోత్సవ సంబరాల వేళ ఆదివారం సాయంత్రం విద్యుత్ కాంతులతో ట్యాంక్‌బండ్ ప్రాంతం నూతన శోభను సంతరించుకుంది. వీకెండ్ కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఫ్యామిలీ మెంబర్లతో సహా చేరుకున్నారు. డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంతో సహా ఎన్టీఆర్‌గార్డెన్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద మూడు వేదికలను ఏర్పాటు చేశారు. ఆయా వేదికలపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అంతకుముందు నెక్లెస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ సమీపంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ప్రముఖ సినీతారలు మీనాక్షి చౌదరి, అంజలితో పాటు పలువురు సందర్శించి సందడి చేశారు.


















## నిజం సుకుమార్‌కే తెలియాలి



సోషల్ మీడియా వచ్చాక జనాల్లో క్రియేటివిటీ పెరిగిపోయింది. వార్తలు వండటంలో ఒక్కొక్కరూ ఆరితేరిపోతున్నారనే చెప్పాలి. వాటిల్లో ఎక్కువ శాతం గాలివార్తలే ఉండటం చేత, నిజాలు చెప్పినా నమ్మే పరిస్థితి ప్రస్తుతం సమాజంలో లేదు. రీసెంట్‌గా ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. 'పుష్ప 2' హిట్ అవ్వడంతో 'పుష్ప3' ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'పుష్ప2' ఎండింగ్‌లో 'పుష్ప 3-ర్యాంపేజ్' అంటూ మూడో పార్ట్‌ని దర్శకుడు సుకుమార్ ప్రకటించేశారు. దాంతో ఇప్పుడు 'పుష్ప 3' గురించి ఆసక్తికరమైన ఓ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. 'పుష్ప 3' విజయ్ దేవరకొండ కథానాయకుడిగా ఉంటుందనేది ఈ వార్త సారాంశం. బాంబ్ బ్లాస్టింగ్‌లో శ్రీవల్లి మినహా పుష్పరాజ్ అండ్ ఫ్యామిలీ చనిపోతారట. శ్రీవల్లికి విజయ్ దేవరకొండ పుడతాడట. మూడో పార్టంతా దేవరకొండ చుట్టూనే తిరుగుతుందట. ఇందులో నిజం ఎంతుందో తెలీదుకానీ.. వార్త మాత్రం బలంగానే వినిపిస్తున్నది. వినడానికి కూడా గమ్మత్తుగా ఉంది. మరి ఇందులో నిజం ఆ సుకుమార్‌కే తెలియాలి.

## మత్తు కళ్ళతో షాలిని..



రచూ నెట్టింట లేటెస్ట్ ఫ్యాషన్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న అందాల భామ షాలిని.స్టైలిష్ నిట్టెడ్ అవుట్ ఫిట్ లో షాలిని గ్లామర్ ట్రీట్ అందరి చూపు తిప్పేస్తుంది.గాలికి ఎగురుతున్న జుట్టు, మత్తు కళ్ళతో కుర్రాళ్ళ హాట్ బీట్ పెంచేస్తోంది ఈ ముద్దుగుమ్మ.మినిమల్ మేకప్, సింపుల్ డ్రెస్సింగ్ షాలిని అందాన్ని మరింత పెంచాయి. స్టార్ హీరో విజయ్ దేవరకొండ సరసన అర్జున్ రెడ్డి సినిమాతో తెలుగులో ఫుల్ క్రేజ్ దక్కించుకుంది ఈ బ్యూటీ. తెలుగులో 118, అర్జున్ రెడ్డి, మహానటి, కథానాయకుడు సినిమాల్లో మెరిసిన బ్యూటీ. తక్కువ సినిమాలు చేసినప్పటికీ.. గ్లామర్, నటనతో ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ రీసెంట్ గా 'మహారాజ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన షాలిని .





## ఏప్రిల్‌లో యాక్షన్ మొదలు?

'బాహుబలి 2' తీసి దేశంలోని ఫిల్మ్ మేకర్స్ అందరికీ ఓ టార్గెట్‌ని ఇచ్చేశారు రాజమౌళి. ప్రస్తుతం మేకర్స్ అందరి లక్ష్యం ఒక్కటే.. 'బాహుబలి 2'. చిత్రమేంటంటే.. ఆ తర్వాత రాజమౌళి కూడా 'ఆర్‌ఆర్‌ఆర్' తీశారు. కానీ 'బాహుబలి 2'ని చేరుకోలేకపోయారు. తన రికార్డును తానే అందుకోలేకపోయారన్నమాట. త్వరలో చేయనున్న మహేశ్‌బాబు సినిమాతోనైనా తన రికార్డును బ్రేక్ చేయాలనే కసితో ముందుకెళ్తున్నారు రాజమౌళి. ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దక్షిణాఫ్రికా రచయిత విల్బర్ స్మిత్ రచనల ఆధారంగా ఈ స్క్రిప్ట్ తయారు చేసుకున్నామని ఇటీవల చిత్ర కథారచయిత విజేంద్రప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ చివరి వారంలో మొదలవుతుందట. జనవరి నుంచి వర్క్ షాపులు నిర్వహిస్తారట. ప్రముఖ ఇండోనేషియన్ బ్యూటీ చెల్సియా ఇస్లాన్ ఇందులో హీరోయిన్‌గా నటించనున్నట్టు తెలుస్తున్నది. మూడు భాగాలుగా రూపొందనున్న ఈ భారీ పాన్ వరల్డ్ మూవీని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ నిర్మించనున్న విషయం తెలిసిందే.



## ప్రేక్షకుల వల్లే..

సినిమా వార్షికోత్సవాన్ని జరుపుకునే సందర్భంలో నేను సందీప్ రెడ్డి వంగాతో మాట్లాడాను. కానీ సీక్వెల్ విషయంలో ఏం జరుగుతుందో నాకు తెలియదు. ప్రేక్షకులు సీక్వెల్ కావాలని కోరుకుంటు న్నారు కాబట్టి తప్పకుండా తెరకెక్కిస్తార ని నమ్ముతున్నానన్నాడు. నేను ఎప్పుడూ కలలుగన్న ఏడాదిని యానిమల్ నాకు ఇచ్చింది. నేను ఎక్కడికెళ్లినా ప్రజల నుండి ప్రేమ, ఆశీర్వాదాలను పొందుతు న్నాను. 29 ఏండ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకు మరో అవకాశం వచ్చింది కాబట్టి. నా బెస్ట్ ఇవ్వాలి. యానిమల్ నాకు ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చిందని చెప్పుకొచ్చాడు. మరి సీక్వెల్ ఉంటే బాబీ డియోల్ పాత్ర ఎలా ఉండబోతుందన్నది మాత్రం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ లీడ్ రోల్ పోషించిన మూవీ యానిమల్ . కన్నడ బ్యూటీ రష్మిక మందన్నా, తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించారు. 2023 డిసెంబర్ 1న హిందీతోపాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ బాబీ డియోల్ పోషించిన అబ్రార్ హాక్ పాత్రకు సూపర్ రెస్పాన్స్ వచ్చింది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.